RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ శనివారం 04.04.2026 సంపుటి:03 సంచిక:119 పేజీలు:08 వెల : 05
Karimnagar Saturday 04.04.2026 Volume : 03 Issue : 119 Pages : 08 Cost : 05

తెలుగు దినపత్రిక

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190
జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Regd.No. 914/2015
JSS
Journalists Sankshema Sangam
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH TRADE UNION
మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

## టెక్స్‌టైల్ తమకు కేవలం పరిశ్రమ కాదు .. అది జీవనాధారం

# సీఎం రేవంత్‌రెడ్డి



**జనోదయ హైదరాబాద్, ఏప్రిల్ 03:**

టెక్స్‌టైల్ రంగం తమకు కేవలం పరిశ్రమ మాత్రమే కాదని, అది లక్షలాది మంది జీవనాధారమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన ఏషియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్ 2026లో పాల్గొని ఆయన ప్రసంగించారు. తెలంగాణకు చేనేత రంగంలో గొప్ప వారసత్వం ఉందని సీఎం తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వంటి అనేక ప్రత్యేక ఉత్పత్తులు రాష్ట్ర గుర్తింపుగా నిలిచాయని చెప్పారు. ఈ రంగంలో తెలంగాణ ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలు ఉన్నాయని వివరించారు.

ఈ సదస్సుకు హాజరైనవారు కేవలం అతిథులు మాత్రమే కాకుండా రాష్ట్ర అభివృద్ధికి భాగస్వాములని, తమ విజన్‌ను పంచుకునే స్నేహితులని సీఎం అభివర్ణించారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉందని, శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్ రంగాన్ని అభివృద్ధి చేశాయని తెలిపారు.

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయానికి పవిత్ర వస్త్రాలు సమర్పించడం తనకు గౌరవంగా భావిస్తున్నా నన్నారు. టెక్స్‌టైల్ తెలంగాణ డీఎన్ఏలోనే భాగమని, నిజాం కాలంలో ప్రపంచం నలు మూలల నుండి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారని గుర్తుచేశారు.

భారతదేశంలో పత్తి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, తెలంగాణ పత్తి నాణ్యతకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందన్నారు. రాష్ట్రంలోని పత్తి పొలాల నుండి లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోల వరకు తమ అనుబంధం ఉందని తెలిపారు.

### వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్ పార్క్

వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని సీఎం వెల్లడించారు. ఇందులో అనేక అపారెల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో నైపుణ్యం, సంకల్పం రెండూ ఉన్నాయని, డీప్ టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎనర్జీ రంగాల్లో రాష్ట్రం వేగంగా ఎదుగుతోందని చెప్పారు.

తెలంగాణ రైజింగ్ 2047 తమ లక్ష్యమని, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించామని స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలో టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

పెట్టుబడిదారులకు మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, ప్రోత్సాహకాలు, వేగవంతమైన అనుమతులు అందిస్తున్నామని సీఎం చెప్పారు. ప్రపంచానికి సరితూగే విధానాలు తెలంగాణలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రపంచ స్థాయి సినిమా నిర్మాణ కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నదని, టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే దీనిని కేంద్రంగా ఉపయోగిస్తున్నాయని, ఇప్పుడు హాలీవుడ్ కూడా ఆకర్షితమవుతోందన్నారు. సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ దుస్తులు కూడా తెలంగాణ నుంచే అందేలా ప్రోత్సహిస్తామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. ప్రపంచానికి వ్యాక్సిన్లు, ఔషధాలు అందించిన రాష్ట్రం తెలంగాణేనని, ఆపిల్ ఇయర్‌పాడ్స్ వంటి ఉత్పత్తులు కూడా ఇక్కడే తయారవుతున్నాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు.

### నేతన్నకు సామాజిక న్యాయం

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ టెక్స్‌టైల్ రంగం కేవలం వ్యాపారం కాదని, అట్టడుగున ఉన్న నేతన్నకు అందించే సామాజిక న్యాయం అని తెలిపారు. మహాత్మా గాంధీ చరఖాతో స్వదేశీ ఉద్యమం ద్వారా చేనేత ప్రాధాన్యతను ప్రపంచానికి చాటారని చెప్పారు.

గ్లోబల్ సప్లై చైన్‌లో నేతన్న కేవలం కూలీగా కాకుండా యజమానిగా ఎదగాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. చేనేత రంగానికి సాంకేతికతను అనుసంధానం చేసి "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణను ఆవిష్కరణలకు కేంద్రంగా నిలబెట్టేందుకు కృషి కొనసాగుతోందన్నారు.

# గజ్వేల్ నుంచి పోటీ చేస్తా...

## కవిత సంచలన నిర్ణయం

ఎక్కడి నుంచి పోటీ చేయాలనే నిర్ణయం ఇంకా తీసుకోలేదన్న కల్వకుంట్ల కవిత

కాంగ్రెస్ మా ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అంటూ కవిత వ్యాఖ్యలు

ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల పెంపుపై ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్

యువతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ జాగృతి ప్రకటన

ఫీజుల దోపిడీ ఆపకపోతే కాంగ్రెస్‌కు కూడా బీఆర్ఎస్ పరిస్థితి వస్తుందని హెచ్చరిక



**జనోదయ హైదరాబాద్, ఏప్రిల్ 03:**

ఎక్కడ నుంచి పోటీ చేయాలనే నిర్ణయం ఇంకా తీసుకోలేదని.. సిద్దిపేటనే కాకుండా గజ్వేల్ మహిళలకు రిజర్వ్ అయినా అక్కడి నుంచి పోటీ చేస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. శుక్రవారం జాగృతి భవన్‌లో మీడియా సమావేశం అనంతరం ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మా ప్రథమ శత్రువు కాంగ్రెస్. మా పోరాటం ఆ పార్టీపైనే..' అని అన్నారు. సిద్దిపేటలో రేవంత్‌రెడ్డి, గుంటనక్క మధ్య ఒప్పందం ఉన్నదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నన్ని డబ్బులు తమ దగ్గర లేవని చెప్పారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్‌రెడ్డి హైదారబాద్‌ను ఆగం చేస్తున్నారన్నారు. పార్టీ ఆవిర్భావ వేదికపై తమ ఎజెండా చెప్తామని.. తమ పార్టీ నాయకులతోపాటు ఉద్యమకారులు వేదికపై ఉండే అవకాశం ఉన్నదని చెప్పారు. ఆవిర్భావ సభకు ఇతర పార్టీల నేతలను ఆహ్వానించడం లేదని.. పార్టీ ఆవిర్భావ సభకు ముందు, తర్వాత కూడా జాయినింగ్స్ ఉంటాయని తెలిపారు. తమ పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని.. బీఆర్ఎస్ పార్టీ స్లీపింగ్ మూడ్‌లో ఉన్నదని అన్నారు. మహిళా రిజర్వేషన్లు తమకు, తమ పార్టీకి గొప్ప అవకాశమని తెలిపారు. గోవాలో 25 వేల మందికి ఒక ఎమ్మెల్యే ఉంటే.. మన దగ్గర 7 లక్షల మందికి ఒక ఎమ్మెల్యే ఉన్నారని అన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఉన్న సీట్లలో 50 శాతం సీట్ల పెంపు ఎలా సహేతుకం అవుతుందని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి గతంలో మహారాష్ట్ర, బీహార్‌కు వెళ్లి ప్రచారం చేస్తే కాంగ్రెస్ ఓడిపోయిందని.. ఇప్పుడు కేరళలోనూ అలాంటి ఫలితమే వస్తుందని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీల అమలు గురించి ఆయన కేరళ ప్రజలకు చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు.


### ఫీజుల దోపిడీ నుంచి రక్షించాలి...

ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఒకేసారి 30 శాతం నుంచి 40 శాతం ఫీజులు పెంచి విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఇందుకోసం అసెంబ్లీ ప్రత్యేక సెషన్ నిర్వహించి బిల్లు పాస్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లితండ్రులపై ప్రైవేట్ స్కూల్స్ అడ్డగోలుగా ఫీజుల భారం మోపుతున్నాయని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తేవటంలో విఫలమైందంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండి ఫీజుల నియంత్రణ చట్టం ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా ఇప్పటి వరకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువచ్చే ప్రయత్నమే చేయలేదన్నారు. విద్యా కమిషన్ చెత్త నివేదిక ఇచ్చిందని.. ఆ కమిషన్ ఇచ్చిన నివేదికలో ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలనే సిఫార్సు మాత్రమే ఆమోదయోగ్యమైనదని తెలిపారు. ఫీజుల దోపిడీని ప్రోత్సహిస్తే బీఆర్ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. కార్పొరేట్, నార్త్ ఇండియన్ స్కూల్స్ ఏర్పాటుతో తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా కాలేజీల యాజమాన్యాలు ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే విద్యాశాఖ మంత్రి కావడం మన ఖర్మ అన్నారు. విద్యావ్యవస్థ ఆగమవుతుంటే కనీసం రివ్యూ కూడా చేయటం లేదన్నారు.

# చైనా భారీ రాకెట్ ప్రయోగం విఫలం

**జనోదయ డిల్లీ, ఏప్రిల్ 03:**



వాణిజ్య అంతరిక్ష పరిశోధన ప్రయోగాల్లో చైనా శాస్త్రవేత్తలకు ఎదురుదెబ్బ తగిలింది. ప్రైవేటుగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన తియాన్‌లాంగ్3 రాకెట్ ప్రయోగం విఫలమైంది. సాంకేతిక సమస్య కారణంగానే నిర్దేశిత కక్ష్యలోకి వెళ్లలేకపోయినట్లు సంబంధిత సంస్థ వెల్లడించింది.

బీజింగ్‌కు చెందిన స్పేస్ పయనీర్ అనే ప్రైవేటు సంస్థ.. స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9కు పోటీగా భారీ రాకెట్‌ను అభివృద్ధి చేసింది. దీనిని ఏప్రిల్ 3న డాంగ్‌ఫెంగ్ కమర్షియల్ ఏరోస్పేస్ ఇన్నోవేషన్ కేంద్రం నుంచి ప్రయోగించింది. నింగిలోకి దూసుకెళ్లిన కొన్ని నిమిషాల్లోనే అది విఫలమైంది. ఇందుకు గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుపుతున్నామని స్పేస్ పయనీర్ వెల్లడించింది. ఈ సందర్భంగా భాగస్వామ్య పక్షాలకు క్షమాపణ చెబుతున్నామని, తదుపరి మిషన్‌లు విజయవంతమయ్యేలా కృషి చేస్తామని ఓ ప్రకటనలో తెలిపింది.

# ఉత్కంఠ మ్యాచులో పంజాబ్ విజయం...

## చెన్నైకి తప్పని మరో ఓటమి

**జనోదయ హైదరాబాద్, ఏప్రిల్ 03:**



ఐపీఎల్ 2026లో భాగంగా నేడు జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై పంజాబ్ కింగ్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. చివరి వరకు నువ్వా నేనా అన్నట్టుగా సాగిన ఈ మ్యాచ్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 209 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ గైక్వాడ్ 28 పరుగులు చేసి మంచి ఆరంభం ఇచ్చాడు. తరువాత బ్యాటింగ్‌కు వచ్చిన ఆయూష్ అద్భుతంగా ఆడుతూ 73 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. దూబే 45 పరుగులతో వేగంగా ఆడగా, సర్ఫరాజ్ 32 పరుగులు చేసి జట్టుకు బలమైన స్థితి తీసుకొచ్చారు. దీంతో సీఎస్‌కే జట్టు 200 దాటిన భారీ లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందు ఉంచింది. పంజాబ్ బౌలర్లలో విజయ్ కుమార్ రెండు వికెట్లు తీసి సీఎస్‌కే బ్యాటర్లను కొంతవరకు అదుపులో పెట్టాడు. బార్ట్లెట్, జేసన్, చాహల్ తలో వికెట్ తీసి తమ వంతు పాత్ర పోషించారు. అయితే చెన్నై బ్యాటర్లు దూకుడుగా ఆడటంతో భారీ స్కోరు నమోదైంది. 210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ జట్టు ఆరంభం నుంచి దూకుడుగా ఆడింది. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య 39 పరుగులు, ప్రభమన్ సింగ్ 43 పరుగులు చేసి జట్టుకు మంచి ఆరంభం ఇచ్చారు. తరువాత బ్యాటింగ్‌కు వచ్చిన అయ్యర్ అర్ధ సెంచరీ చేసి జట్టును విజయానికి దగ్గర చేశాడు. కనోలి 36 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మ్యాచ్ చివరి ఓవర్ల వరకు ఉత్కంఠభరితంగా సాగింది. చివరకు పంజాబ్ జట్టు 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించి 5 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ జట్టు టోర్నీలో రెండో విజయాన్ని నమోదు చేయగా, చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఇది రెండో ఓటమిగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు అద్భుత ప్రదర్శన కనబరచడంతో ప్రేక్షకులు పూర్తి స్థాయి వినోదాన్ని ఆస్వాదించారు. ఐపీఎల్ 2026లో ఈ మ్యాచ్ అత్యంత ఉత్కంఠ భరిత మ్యాచ్‌లలో ఒకటిగా నిలిచింది.

# పేకాట స్థావరం పై దాడి చేసిన పోలీస్‌లు వ్యక్తుల అరెస్ట్.

**చెన్నూర్, ఏప్రిల్ 02 (జనోదయ ఆర్‌సీ):**



మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం దుగ్నేపల్లి శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... రాత్రి 1 గంట సమయంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ ఆదేశాలపై చెన్నూర్ సీఐ బన్సీలాల్, ఎస్ఐ శ్యామ్ పటేల్ తమ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. రాత్రి 1 గంటలకు చెన్నూర్ మండలం దుగ్నేపల్లి శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ ఆదేశానుసరం చెన్నూర్ సీఐ బన్సీలాల్, ఎస్ ఐ శ్యామ్ పటేల్ లు తమ పోలీస్ సిబ్బందితో కలసి పేకాట స్టావరం పై దాడి చేయగా 4 వ్యక్తులు 1) దాద జంపయ్య, ని: నాగపూర్ గ్రామం, 2) మేకల రాంచందర్, ని: దుగ్నేపల్లి, 3) గజ్జెల రజనీకాంత్, ని: మల్లారం మరియు 4) దెబ్బ హరీష్, ని: దుగ్నేపల్లి పట్టుబడినారు మిగతా వారు దాదాపు 13 మంది పంట చేను లగుండా పారిపాయినారు వారి సమాచారం సేకరించడం జరిగినది, వీరితోపాటు మరికొంతమంది తమ బైకులను అక్కడే వదిలి పారిపోయినారు. పట్టుబడిన 4 వ్యక్తుల నుండి నగదు రూ. 36,000/, ఐదు మొబైల్ ఫోన్స్, 3 బైకులు మరియు (52) పేక ముక్కలు స్వాధీన పర్చుకొని వారిని పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి క్రైమ్ నెంబర్ 85/2026, U/sec. 9 (i) క్రింద కేసు నమోదు చేయడం జరిగినది. పారిపోయిన మిగతావారిని కూడా పట్టుకొని అరెస్ట్ చేయడం జరుగుతుంది.

## పిన్నారం గ్రామమ్ లో ప్రజా పాలనా - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం.



**కోటపల్లి ఏప్రిల్ 02, (జనోదయ):**

ఈరోజు ఉదయం 9:30 గంటలకు గ్రామ సభ సమావేశం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ పొన్నాల తిరుపతి, ఎంపీడీఓ, ఉపసర్పంచ్ పరుపట్ల వెంకటేశం, గ్రామ కార్యదర్శి, జీపీఓ, వార్డు సభ్యులు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్, గ్రామ ప్రజలు మరియు ఇతర అధికారులు హాజరయ్యారు. సమావేశంలో గ్రామ అభివృద్ధి, ఆరోగ్యం, శుభ్రత, సంక్షేమ పథకాలు వంటి ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగింది. గ్రామ ప్రజలు తమ సమస్యలను సమావేశంలో తెలియజేసి, వాటి పరిష్కారం కోసం సూచనలు చేశారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని గ్రామ సర్పంచ్ పొన్నాల తిరుపతి పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతో గ్రామసభ సమావేశం సాఫీగా, విజయవంతంగా ముగిసింది.

## 19 ఏళ్లకే అమరుడైన దొడ్డి కొమురయ్యకు ఘన నివాళులు



**జనోదయ, మంథని ఏప్రిల్ 02:**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడైన దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మంత్రి టిఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ కడవెండి గ్రామానికి చెందిన కొమురయ్య నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడి, 19 ఏళ్ల వయసులోనే ప్రాణాలర్పించారన్నారు.
అనంతరం దొడ్డి కొమురయ్య విగ్రహ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు పర్ష బక్కన్న మాట్లాడుతూ "భూమి, భుక్తి, విముక్తి" కోసం ప్రజల్లో పోరాట స్ఫూర్తిని రగిలించిన మహానుభావుడిగా కొమురయ్య నిలిచారని పేర్కొన్నారు. బొక్కలవాగు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళం శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మయ్య, నాయకులు తగరం శంకర్ లాల్, వేల్పుల గట్టయ్య, కాయితీ సమ్మయ్య, సర్పంచ్ కొమురయ్య, పుప్పాల తిరుపతి, జంజర్ల శేఖర్, అంబటి నర్సింగ్, ఆసిఫ్ ఖాన్, మంథని లక్ష్మణ్, జక్కుల ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం -బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి

**జనోదయ (మంథని)పెద్దపల్లి, ఏప్రిల్ -03:**




దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శమని బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి తెలిపారు.శుక్రవారం బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి,దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేలరాలిన తొలి రక్తపు చుక్క అని,నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అని ,ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు.మహనీయులను ఒక కులానికో ,ఒక వర్గానికో పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ,జిల్లా అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ముత్తారం, మంథని ప్రాంతంలో పర్యటించిన జిల్లా కలెక్టర్**



**జనోదయ, మంథని,ముత్తారం, ఏప్రిల్ 03:**

మంథని, ముత్తారం ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులు సమయానికి నాణ్యతతో పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముత్తారం మండలంలోని దర్యాపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో కోటి రూపాయల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను, మంథని పట్టణం లోని అయ్యగారి చెరువు రీ మోడలింగ్ పనులను కలెక్టర్ పరిశీలించారు
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లాలో అభివృద్ధి పనులు సమయానికి, నాణ్యతతో పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ముత్తారం మండలంలోని దర్యాపూర్ మోడల్ స్కూల్ లో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1 కోటి నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.
పనుల పురోగతి పై సమగ్రంగా ఆరా తీసి, ఇప్పటికే ఆమోదించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు పనుల కోసం మరిన్ని నిధులు అవసరమైతే వెంటనే అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని, అంచనాలు అందిన వెంటనే అవసరమైన అదనపు నిధులను మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు.

**అయ్యగారి చెరువు రీ మోడలింగ్ పనుల పరిశీలన**

అనంతరం మంథని మున్సిపాలిటీ పరిధిలోని అయ్యగారి చెరువు రీమోడలింగ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. చెరువు పునర్నిర్మాణ పనులను వచ్చే సోమవారం నుంచి ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి ప్రతిపాదిత పనుల్లో కనీసం 50 శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనులు వేగవంతంగా, నాణ్యతతో కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**జనోదయ గంగాధర ఏప్రిల్ 03:** గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ క్రింద ముంపుకు గురవుతున్న నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకొని న్యాయం చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. నారాయణపూర్ రిజర్వాయర్ క్రింద ఇండ్లు కోల్పోయి పరిహారం మంజూరైన లబ్ధిదారులు శుక్రవారం గంగాధర మండలం మధురానగర్‌లోని ఎమ్మెల్యే ప్రజా కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నారాయణపూర్ గ్రామస్తులను దశలవారీగా ఆదుకునేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి గ్రామస్తులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు.

ఇంకా 15 రోజుల్లో నారాయణపూర్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడుతామని తెలిపారు. రిజర్వాయర్ క్రింద ఉన్న ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామడుగు మల్లేశం, బాబు మల్లేశం, బుర్ర కిరణ్, గడ్డం కార్తిక్, రాగుల మల్లయ్య, నరాల శ్రీనివాస్, లోకిని తిరుపతి, బాబు నవిన్ తదితరులు పాల్గొన్నారు.



# భావోరావుపేట్ గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు..

**జనోదయ చెన్నూరు ఏప్రిల్ 03 :**

కీర్తి శేషులు శ్రీ రాధేశ్యామ్ గహ్లోత్ జ్ఞాపకార్థం స్వయంభు గా వెలిసిన భౌరావుపేట గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి జయంతి వేడుకలు రాధేశ్యం కుమారుడు గుడిని సుందరంగా ముస్తాబు చేయించి స్వామి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిపించారు.స్వామి పూజల అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.గ్రామ ప్రజలందరు కలిసి కట్టుగా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసారు.ఈ కార్యక్రమంలో పవన్ గహ్లోత్, నిషా, శివం, ఖుషి, అయాన్ సర్కార్,సౌమ్య మహిర, తాటి శ్రీనివాస్,మాధురి,రమేష్‌మసాని.కళావతి పాల్గొన్నారు..



# రేవంత్ పోవాలి.. మార్పు రావాలి

## -జీవన్ రెడ్డి

**జగిత్యాల , జనోదయ ఏప్రిల్ 03:**

మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో సంచలన వ్యాఖ్యలు చేశారు. 'రెండేళ్ల పాలనలోనే సీఎం రేవంత్ రెడ్డి పోవాలి, మార్పు రావాలి అనే పరిస్థితి ఏర్పడింది' అని అన్నారు. గతంలో కూడా కేసీఆర్ పోయి మార్పు రావాలనే నినాదంతోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేశారని తెలిపారు. ఇప్పుడు ఈ రెండేళ్లలో రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని పేర్కొన్నారు.

ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన జీవన్ రెడ్డి, శుక్రవారం జగిత్యాలలోని తన నివాసంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఇంతకాలం పార్టీలో తనకు అడ్డు తొలగించుకునేందుకే నామినేటెడ్ పదవుల్లో జాప్యం చేశారని ఆరోపించారు. తాను రాజీనామా చేసిన తర్వాత పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేయడం గమనార్హమన్నారు. ఎంతోకాలంగా పార్టీని నమ్ముకున్న వారిని పక్కనపెట్టి, పార్టీ సభ్యత్వం కూడా లేని వారికి పదవులు ఇస్తున్నారని విమర్శించారు. నామినేటెడ్ పదవుల విషయాన్ని పలుమార్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, తాను రాజీనామా చేసిన వెంటనే ఒకదాని తర్వాత ఒకటి పదవులు భర్తీ చేయడం విచిత్రంగా ఉందన్నారు.

### కాళేశ్వరం పునరుద్ధరణలో ప్రభుత్వ నిర్లక్ష్యం

కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న విమర్శలు రాజకీయ కోణంలో మాత్రమే జరుగుతున్నాయని, కానీ ప్రాజెక్టు పునరుద్ధరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని జీవన్ రెడ్డి మండిపడ్డారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలు మొత్తం ప్రాజెక్టులో చిన్న భాగమేనని తెలిపారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు సుమారు రూ.500 కోట్లలోపే ఖర్చవుతుందని, అయినా ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక వచ్చినప్పటికీ ప్రభుత్వం అమలు చేయలేదని గుర్తు చేశారు. ప్రాణహిత నది జలాలను వినియోగించుకునే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కనీసం సరైన డిజైన్ కూడా రూపొందించలేదని అన్నారు. బడ్జెట్‌లో కేవలం రూ.152 కోట్లు మాత్రమే కేటాయించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. కడెం, ఎస్ఆర్ఎస్పీ ద్వారా 100 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవనాధారమని, హైదరాబాద్ తాగునీరు, పారిశ్రామిక అవసరాలు, మూసి ప్రక్షాళన అన్నీ దీనిపైనే ఆధారపడుతున్నాయని తెలిపారు. మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టకపోతే దాదాపు 18 లక్షల ఎకరాల సాగు భూమి, హైదరాబాద్ అవసరాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని హెచ్చరించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోతే తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల పునరుద్ధరణను వెంటనే చేపట్టాలని, లేకపోతే ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని తెలంగాణ సమాజం క్షమించదని హెచ్చరించారు.


### బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల అభి-మానానికి కృతజ్ఞతలు..

ప్రజాసేవ చేయాలంటే తప్పకుండా ఏదో ఒక పార్టీలో ఉండాల్సిన అవసరం ఉందని జీవన్ రెడ్డి అన్నారు. భవిష్యత్ రాజకీయ నిర్ణయాలు అభిమానులు, అనుచరుల అభిప్రాయం మేరకు తీసుకుంటానన్నారు. తనపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. మరో రెండు వారాల్లో తాను ఏ పార్టీలో చేరతానో మీడియా ద్వారానే ప్రకటిస్తానని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా బీఆర్ఎస్ పార్టీ ప్లీనరీ సమావేశాలను నిర్వహించే విషయంపై పార్టీ అధిష్టానం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈసారి జగిత్యాల జిల్లా కేంద్రంలో సమావేశాలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జగిత్యాల సమీపంలో వ్యవసాయ భూముల్లో భారీ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసే అంశంపై సమాలోచనలు జరుగుతున్నట్లు సమాచారం. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న తర్వాత స్పష్టమైన ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

### ఏప్రిల్ 13న చేరిక?

మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో ప్లీనరీ సమావేశాల్లో చేరనున్నట్లు సమాచారం. జీవన్ రెడ్డి పార్టీలోకి రావడం ద్వారా బలమైన రాజకీయ సంకేతాలు పంపించాలనే ఆలోచనలో పార్టీ అధినేత కేసీఆర్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్లీనరీ సభ వేదికపైనే జీవన్ రెడ్డికి అప్పగించే బాధ్యతలను ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



# నాలాలను కబ్జా చేస్తే ఉపేక్షించం

జనోదయ, గోదావరిఖని, ఏప్రిల్ 03: నాలా లు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తే ఊరుకునేది లేదని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి హెచ్చరించారు. హెచ్చరించడమే కాకుండా 35 వ డివిజన్ వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఐ బి కాలనీలో పర్యటించిన ఆయన ప్రదాన కాలువ కల్వర్ట్ ప్రక్కన అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని జె సి బి యంత్రం తో కూల్చి వేయించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాలలో పూడిక తీత కార్యక్రమం నిరంతరంగా కొనసాగడానికి బఫర్ జోన్ అవసరమని అన్నారు. బఫర్ జోన్ ఆక్రమించి కట్టుకుంటే కూల్చివేయక తప్పదని అన్నారు. బఫర్ జోన్ లో సానిటేషన్ ట్రాక్టర్ వెళ్ళడానికి వీలుగా సి సి రోడ్డు కూడా నిర్మిస్తామని అన్నారు. గతంలో కాలువల్లో పూడిక తీత అంటే లక్షల రూపాయలు వెచ్చించి టెండర్ పిలిచి తూతూ మంత్రంగా పనులు చేసేవారని ప్రస్తుతం నగర పాలక సంస్థ పై ఆర్థిక భారం పడకుండా మున్సిపల్ యంత్రాలతో , మున్సిపల్ సిబ్బందితోనే పని చేయిస్తున్నామని అన్నారు. కాలువల్లో చెత్త వేయకుండా మునిసిపల్ వాహనానికి ఇవ్వాలని చేతులు జోడించి వేడుకుంటున్నానని అన్నారు. కాలువల్లో చెత్త వేయడం వలన పరిశుభ్రం చేయడానికి డబ్బు వృథా కావడంతో పాటు మురుగు నీరు సాఫీ గా పర్వహించకుండా నిలిచిపోయి దుర్వాసన , దోమలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ జంగపెల్లి రమాదేవి శ్రీనివాస్ తో పాటు పలువురు కార్పొరేటర్లు కంకణాల మౌనిక రాజు , వడ్లూరి రవి, దాసరి సాంబమూర్తి, ధూళి కట్ట సతీష్ పలువురు నాయకులు వేగోలపు శ్రీనివాస్ , పీచర శ్రీనివాస రావు , కాలనీ వాసులు శ్రమదానం చేశారు. పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి కాలువ ప్రక్కన పెరిగిన పిచ్చి చెట్లు , తుప్పలను తొలగించే పనిలో పాలు పంచుకున్నారు. నగర పాలక సంస్థ అధికారులు కూడా చేయి కలిపారు దీంతో ఐ బి కాలనీ కల్వర్ట్ కు ఇరువైపులా పొదలు తొలగి పోయి శుభ్ర పడడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది , యంత్రాలు కాలువ లో సులువుగా పూడిక తొలగించడానికి అనుకూలంగా మార్గం ఏర్పడింది. శ్రమ దానంలో పంచుకున్న అందరినీ మేయర్ అభినందించారు. ఐ బి కాలనీ ప్రవేశంలో మూలన పేరుకుపోయిన శిధిలాలు చెత్త ను తొలగించారు. నీటి సరఫరా వాల్వ్ కోసం తవ్విన గుంత లపై ప్రమాదాలు జరగకుండా మూతలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుటనే చెత్త ఉండడం గమనించి శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. కాలనీ ప్రవేశం లోనే మూల మలుపు వద్ద వృధా గా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ఆదేశించారు. మెడికల్ కళాశాల రోడ్డులో డ్రైన్ జె సి బి యంత్రంతో పూడిక తీయడంతో మురుగు నీరు సాఫీగా ప్రవహిస్తున్నది. పూర్తి స్థాయిలో పని పూర్తయ్యేంతవరకు కొనసాగించాలని మేయర్ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు డి .ఇ.షాభాజ్, ఎ ఇ మీర్, టి పి ఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, టి పి బి ఓ శ్రావణ్, ఎలెక్ట్రికల్ ఎ ఇ రాంజీ, సానిటరి ఇన్స్పెక్టర్ నాగ భూషణం, జవాన్ బండారి రవి తదితరులు పాల్గొన్నారు.



# పురుగుల మందు తాగి సర్పంచి ఆత్మహత్య

**కడెం ఏప్రిల్ 03, (జనోదయ):**

నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మాసాయిపేట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ దుర్గం లహరిక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెన్ ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో ఆగి ఉన్న ట్రాక్టర్ నాగళ్లకు ఢీకొని మరో ప్రమాదం సంభవించింది . ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కాకపోవడంతో ఊపిరిపీల్చున్నారు. ఆమెను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సర్పంచ్ లహరిక (31)మృతి చెందింది. ఆమెకు భర్త రాజేష్, కొడుకు, కూతురు ఉన్నారు. సర్పంచు లహరిక ఎందుకు ఆత్మహత్యాయత్నం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది అని పోలీసులు విచారణ చేపట్టారు. లహరిక మృతితో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీస్‌లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



# కేరళ ఎన్నికల్లో తెలంగాణ గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం: కిషన్ రెడ్డి

**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కేరళం ఎన్నికల ప్రచారంలో తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని, కావాలంటే కేరళ ప్రజలు వచ్చి చూడాలని చెప్పడం పూర్తిగా అసత్య ప్రచారమని కేంద్ర మంత్రి కిషన్రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.**



**హైదరాబాద్ జనోదయ ఏప్రిల్ 03:** రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని చెప్పడం పూర్తిగా అసత్య ప్రచారమని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, తెలంగాణలో ఆరు గ్యారెంటీలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఒక్క పథకం కూడా సమర్థవంతంగా అమలు కాలేదని, అమలు చేయని పథకాలను అమలు చేసినట్లు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. ఇది సాధారణ అబద్ధం కాదని, ప్రజలను మోసం చేసే ప్రయత్నమని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించిన ఆయన, ఇప్పటికే లెఫ్ట్ పార్టీలు కేరళ ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. గత పది సంవత్సరాలుగా అభివృద్ధిని అడ్డుకున్నాయని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అవినీతి మరింత పెరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు కేరళలో విలువ లేదని, ఆయన అక్కడికి ఎందుకు వెళ్లారో అందరికీ తెలుసని అన్నారు. తెలంగాణ నుంచి డబ్బులు పంపుతున్నారనే అనుమానాలు ప్రజలలో వ్యక్తమవుతున్నాయని, అందుకే కాంగ్రెస్ నాయకులను అక్కడికి పిలుస్తున్నారని ఆరోపించారు. ఉపన్యాసాలు ఇవ్వమని పిలుస్తున్నారని కానీ ఓట్లు మాత్రం పడవని విమర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత టి. హరీశ్ రావు 2014కు ముందు మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలం ముంపు ప్రాంతాలను అన్యాయంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిందని పేర్కొన్నారు. విభజన చట్టంలో ఉన్న అంశాలు కాంగ్రెస్, యూపీఏ ప్రభుత్వ నిర్ణయాలతో జరిగాయని, దీనికి బీజేపీ లేదా కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కాం విషయంలో తాము పూర్తి స్థాయి దర్యాప్తు కోరుతున్నామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మేడిగడ్డ లేదా కొన్ని పిల్లర్ల అంశాలపై మాత్రమే మాట్లాడుతోందని విమర్శించారు. ప్రాజెక్టు మొత్తాన్ని సీబీఐ విచారణకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ అంశం హైకోర్టులో ఉందని, పూర్తి నిజాలు బయటకు రావాలని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అనేక ఆరోపణలు చేసిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి కేసుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, కేసీఆర్ కుటుంబంపై కేసులు పెడతామని, జైలుకు పంపుతామని, లక్ష కోట్లు వసూలు చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. కానీ ఇప్పటి వరకు ఒక్క కేసులో కూడా చర్యలు తీసుకోలేదని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు.

## రాష్ట్రంలో మూడు రోజులు భారీ వర్షాల సూచన




**హైదరాబాద్ జనోదయ ఏప్రిల్ 03:** రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలలో అక్కడక్కడా మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఉత్తర తెలంగాణ జిల్లాలలో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో పాటు వడగళ్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులు పంటలను రక్షించుకునే చర్యలు చేపట్టాలని సూచించారు.

## ఉత్తర భారత్‌లో భూ ప్రకంపనలు: ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో కంపించిన భూమి!

ఉత్తర భారతదేశంలో మరోసారి భూకంపం సంభవించింది. శుక్రవారం రాత్రి ఢిల్లీఎన్‌సీఆర్ (NCR) ప్రాంతంతో పాటు పంజాబ్, హర్యానా, రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. రాత్రి సమయంలో ఒక్కసారిగా ప్రకంపనలు రావడంతో ఇళ్లలో ఉన్నవారు, అపార్ట్‌మెంట్లలో నివసించే వారు ప్రాణభయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ నివేదిక ప్రకారం, ఈ భూకంపం యొక్క కేంద్ర బిందువు ఆఫ్ఘనిస్తాన్‌పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.0 నుండి 5.5 మధ్య నమోదైనట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయి. భూకంపం సంభవించిన సమయంలో ఇళ్లలోని ఫ్యాన్లు, వస్తువులు ఊగడం చూసి స్థానికులు ఆందోళన చెందారు. సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి ఎలాంటి అపాయం జరగకుండా అప్రమత్తం చేశారు. ఎత్తైన భవనాల్లో నివసించే వారు తక్షణమే బయటకు రావాలని సూచించారు.

ప్రస్తుతానికి ఎటువంటి ప్రాణనష్టం లేదా భారీ ఆస్తి నష్టం జరిగినట్లు నివేదికలు అందలేదు. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని, ఎక్కడైనా పగుళ్లు లేదా భవనాలు దెబ్బతిన్నాయేమోనని అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రకంపనలు మళ్లీ వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. గత కొద్ది రోజులుగా ఉత్తర భారత్‌లో అప్పుడప్పుడు భూకంప ప్రకంపనలు సంభవిస్తుండటంతో, భూకంపం వచ్చినప్పుడు పాటించాల్సిన జాగ్రత్తల గురించి విపత్తు నిర్వహణ శాఖ అవగాహన కల్పిస్తోంది.




# కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అతి పెద్ద బలం - పిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

-కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ నియామకం

**జనోదయ ప్రతినిధి ఏప్రిల్ 03 :**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కార్యకర్తల పాత్ర మరువలేనిదని, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు, శుక్రవారం రోజున రామకృష్ణాపూర్ ఎమ్మెన్నార్, గార్డెన్లో నూతనంగా నియమించబడిన మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులకు, నియామక పత్రాలు అందజేశారు, ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని, తెలంగాణను అన్ని విధాల అభివృద్ధి చేయడానికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, అహర్నిశలు కృషి చేస్తున్నారని, తెలంగాణ ప్రజల సంక్షేమానికై రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నట్టు, రానున్న జడ్పిటిసి, ఎంపీటీసీ, ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా నిలవాలని, నూతనంగా మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా నియమింపబడ్డ, నాయకులు కాంగ్రెస్ పార్టీని పటిష్టపరిచే విధంగా పనిచేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని అన్నారు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నట్టు, నూతనంగా మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ పదవుల్లో నియమించబడ్డ నాయకులు, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో మూడు స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలవడం జరిగిందని, మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీని కార్యకర్తలు, తమ భుజస్కందాల పై వేసుకొని, పది సంవత్సరాలు, అనేక కష్టాలు ఎదుర్కొన్నారని, వెంటనే పార్టీ అధినాయకత్వం వారిని గుర్తించి పదవులు ఇవ్వాలని కోరారు, ఈ కార్యక్రమంలో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ సెక్రెటరీ సచిన్ సావంత్, మంచిర్యాల జిల్లా డిసిసి ప్రెసిడెంట్ పిన్నింటి రఘునాథరెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ నీలకంఠేశ్వర్ రావు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, పాల్గొన్నారు.

